పండుటాకులపై పగ

- టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రపై సర్వత్రా ఆగ్రహం
- పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం చేయడంతో తీవ్ర ఆవేదన
- సచివాలయాలకు వెళ్లడం చాలా ఇబ్బంది అంటూ ఆక్రందన
- డబ్బుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న పింఛనుదారులు

పెందుర్తి : ప్రతీ నెలా ఒకటో తేదీన తెలతెలవారుతుండగానే ఇంటికి వచ్చి చేతిలో రూ.3 వేల పింఛన్ పెట్టే వలంటీర్ ఇప్పుడు ఇంటికి రాలేదు... మనమే ఎక్కడో ఉన్న సచివాలయం వద్దకు వెళ్లి క్యూలో నిల్చుని పింఛన్లు తీసుకోవాలట... ఇదెక్కడి దారుణం అంటూ అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లు ఠంచన్‌గా ఇచ్చే వలంటీర్లను సేవల నుంచి తప్పించేందుకు కుట్రలు పన్నిన టీడీపీ అధినేత చంద్రబాబు తీరుపై పింఛనుదారులు మండిపడుతున్నారు. ఇదెక్కడి కుట్ర రాజకీయాలు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐదేళ్లుగా పండగ వచ్చినా, పబ్బం వచ్చినా, వరదలు వచ్చినా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటి ముంగిట్లోనే పింఛన్ నగదు అందుకునేవారిమని... చంద్రబాబు కారణంగా ఈ నెల రెండు రోజులు గడిచినా పింఛన్లు అందలేదని పండుటాకులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ఆసరా, భరోసా లేని వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు నెల వారీ ఖర్చులలో భాగంగా మందులు, నిత్యావసర సరకులు కొనుక్కునేందుకు రెండు రోజులు ఎదురు చూసినా ఫలితం లేకపోయింది. ఆకలితో అలమటించిన అభాగ్యులు ఎందరో వున్నారు. పింఛనర్లపై చంద్రబాబు, అతని బృందం కక్ష కట్టిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు తీరుతో నియోజకవర్గంలో 28 వేల మంది పింఛనుదారులు అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని పెందుర్తి గ్రామీణ ప్రాంతంలో 4,033 మందికి, సబ్బవరంలో 7,744 మందికి, పరవాడలో 5,922 మందికి, జోన్ –8 పరిధిలో 17,668 మందికి సామాజిక పింఛన్లు ప్రభుత్వం అందిస్తుంది. వలంటీర్లను ప్రస్తుతం సేవల నుంచి తప్పించడంతో వీరంతా వెళ్లి సచివాలయాల వద్ద పింఛన్లు తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

మంచం మీద నుంచి లేవలేని పరిస్థితి



మాది పినగాడి పంచాయతీ కోట్నివానిపాలెం. అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితమయ్యాను. కనీసం అడుగుతీసి అడుగు వేయలేని పరిస్థితి. గత ఐదేళ్లుగా నెల నెలా వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ అందించే వారు. ఇప్పుడు వలంటీర్లు రారు... మీరే సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలని చెబుతున్నారు. నా ఆరోగ్య పరిస్థితి బాగోలేదు. ఇప్పుడు రానుపోను ఆరు కిలో మీటర్లు ప్రయాణం చేయలేను. చేతిలో డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాను.

– నూలు చంద్రమ్మ, కోట్నివానిపాలెం

మా ఉసురు చంద్రబాబుకు తగులుతుంది



ప్రతీ నెలా ఇంటికి వలంటీరు వచ్చి పింఛన్ నగదు ఇచ్చేవారు. ఇప్పుడు చంద్రబాబు కుట్ర చేసి మాకు వలంటీర్లు పింఛన్లు ఇవ్వకుండా చేశాడు. సచివాలయానికి వెళ్లి పింఛన్లు తీసుకోమని చెబుతున్నారు. కాలు రాలేని నేను మా ఊరుకి రెండు కిలోమీటర్ల దూరంలో వున్న సచివాలయానికి ఎలా వెళ్లగలను. మా ఉసురు చంద్రబాబుకు తగులుతుంది. రెండు రోజులుగా చేతిలో డబ్బులు లేకపోవడంతో నిత్యావసరాలు తీర్చుకోలేకపోతున్నాం.

– చిరికి భూలోకమ్మ, కరకవానిపాలెం.

ఇంత దుర్మార్గంగా చేస్తారనుకోలేదు



గత ఐదేళ్లుగా క్రమం తప్పకుండా ఇంటికి వచ్చి వలంటీర్లు పింఛన్ ఇచ్చేవారు. ఎంతో ఆనందంగా ఉండేది. కానీ ఇప్పుడు మాకు వలంటీర్లు పింఛన్లు ఇవ్వకుండా చంద్రబాబు దుర్మార్గంగా అడ్డుకున్నాడు. స్వార్థ రాజకీయాల కోసం మమ్మల్ని ఇంతలా ఇబ్బంది పెడతాడనుకోలేదు. మమ్మల్ని ఇబ్బంది పెట్టినవారికి తగినశాస్తి జరుగుతుంది. వృద్ధులు, దివ్యాంగుల ఉసురు చంద్రబాబుకి, అతని అనుచరులకు తగులుతుంది.

– ఇనపకుర్తి నూకాలమ్మ, కరకవానిపాలెం

వైఎస్సార్‌సీపీ నేత బూలిరాజుకు ఎమ్మెల్యే పరామర్శ



బూలిరాజు ఆరోగ్యంపై ఆరా తీస్తున్న అదీప్‌రాజ్

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు గవర జగ్గయ్యపాలెనికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలమరశెట్టి బూలిరాజును ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. ఇటీవల కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్న బూలిరాజు ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న అదీప్‌రాజ్ మంగళవారం బూలిరాజు ఇంటికెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట 88వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గండ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, సీనియర్ నాయకులు దాడి నూకరాజు, మల్ల రమణ, కాండ్రేగుల వీరునాయుడు, ఆళ్ల శ్రీనివాసరావు, ఆళ్ల యుగంధర్, ఆళ్ల బూలిరాజు, ఆళ్ల సత్య అప్పారావు ఉన్నారు.

నూకాంబిక ఆలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం



ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు ఆలయ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రిక అందిస్తున్న కోట నరవ గ్రామ పెద్దలు

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు కోటనరవ గ్రామపెద్దలు మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌ను రాంపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలుసుకున్నారు. గ్రామంలో ఈ నెల 8న నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవానికి ఆహ్వాన పత్రికను అందించారు. గ్రామ పెద్దలు ఆళ్ల పైడిరాజు, శరగడం నూకరాజు, మల్ల రమణ, కర్రి కోటేశ్వరరావు, దొడ్డి మహేశ్వరరావు, దాడి నూకరాజు, మల్ల బంగారునాయుడు, పీలా శ్రీనివాసరావు, కర్రి సన్యాసిరావు, దొడ్డి అప్పారావు, దొడ్డి సాయి, దొడ్డి మురళి, శరగడం సతీష్, దొడ్డి వెంకటేష్, మద్దాల విజిల్, కాళ్ల నరేష్, కర్రి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన కలెక్టర్



వడ్డాదిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

బుచ్చెయ్యపేట : జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి బుచ్చెయ్యపేట మండలంలో పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మంగళవారం రాజాం, బుచ్చెయ్యపేట, దిబ్బిడి, వడ్డాది గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన జిల్లా ఎస్పీ మురళీకృష్ణ, ఆర్డీవో చిన్నికృష్ణతో కలిసి పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద వసతులను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మంచినీటి సదుపాయం, విద్యుత్, బాత్‌రూం సదుపాయంతో పాటు దివ్యాంగులు, వృద్ధులు పోలింగ్ కేంద్రాల్లో వెళ్లడానికి అనువుగా రోలింగ్‌లు ఉన్నదీ లేనిదీ పరిశీలించారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా అధికారులు సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ అధికారులలకు సూచించారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలపై తహసీల్దార్ శ్రీకాంత్, ఎస్‌ఐ ఈశ్వరరావు, ఎంపీడీవో వెంకటాచార్యలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా మండలంలో ఏ గ్రామంలోనైనా మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు కలెక్టర్ సూచించారు.

తాటిపర్తి చెక్‌పోస్టు తనిఖీ

మాడుగుల రూరల్ : జిల్లా ఎన్నికలాధికారి, కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి మంగళవారం సాయంత్రం తాటిపర్తి చెక్‌పోస్టును జిల్లా పోలీసు సూపరింటెండెంట్ కె.వి. మురళీకృష్ణతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 24 గంటల పాటు స్పెషల్ స్ట్రయికింగ్ టీమ్ పనిచేస్తుందన్నారు. నగదు, మద్యం, గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయడానికి ఈ చెక్‌పోస్టు దోహదపడుతుందని, ఇక్కడ పోలీసు, రెవెన్యూ సిబ్బంది కలిసి ప్రతి వాహనాన్ని చెక్ చేస్తారని అన్నారు.

ఈ సందర్భంగా ఆయన చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. వీరి వెంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి.సత్యవాణి, తహసీల్దారు టి.సత్యనారాయణ, ఎ.కోడూరు సీఐ స్వామి నాయుడు, ఎస్‌ఐ పి.దామోదర్‌నాయుడు, ఇతర పోలీసు సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిబద్ధతతో ఎన్నికల విధులు నిర్వర్తించాలి

- మాస్టర్ ట్రైనీల శిక్షణలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

తుమ్మపాల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అధికారులు, సిబ్బంది ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా ఆత్మస్థైర్యం, నిబద్ధతతో పోలింగ్ నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనీల శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంకు, భయం లేకుండా ధైర్యంగా, సజావుగా పోలింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ప్రిసైడింగ్ అధికారులకు విధులపై శతశాతం నమ్మకం, నిబద్ధత కలిగించాలన్నారు. చెక్ లిస్ట్ తీసుకోవడం, తిరిగి అప్పగించడం, మాక్ ఓటింగ్‌తో పాటు పోలింగ్ ప్రారంభానికి ముందు, ముగిసిన తరువాత ఏమేం చేయాలో క్షుణ్ణంగా అవగాహన కలిగించాలన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం తనిఖీ చేసి చూపించడం, పోలింగ్ ఏజెంట్ల బాధ్యతలు తెలియజేయడం పక్కాగా జరిగేలా తర్ఫీదునివ్వాలన్నారు. తరచుగా చోటుచేసుకునే తప్పులు జరగకుండా చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. పోలింగ్ ప్రారంభమయ్యాక ఎక్కువ మంది ఉంటే ఏ విధంగా నియంత్రించవచ్చు, దివ్యాంగులు, ప్రధానంగా అంధుల ఓటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూలంకషంగా చెప్పాలన్నారు. వివిధ రకాల ఓట్లను ఏ విధంగా నిర్వహించాలో విపులంగా వివరించాలన్నారు. అనంతరం అనకాపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి ఏజే చిన్నికృష్ణ అసెంబ్లీ స్థాయిలో పోలింగ్ శిక్షణ విధివిధానాలపై మాస్టర్ ట్రైనీలకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి 52 మంది మాస్టర్ ట్రైనీలు హాజరయ్యారు. కార్యక్రమంలో పౌర సరఫరాల డీఎం జయంతి, డీఎల్‌డీవో నాగమణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు డి.రామ్మూర్తి పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాటానికి మూడేళ్లు

సీతంపేట : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని చూస్తున్న ప్రధాని మోదీ, బీజేపీకి సహకరిస్తున్న టీడీపీ, జనసేన పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ జేఏసీ నాయకులు కార్మిక వర్గానికి, విశాఖ ప్రజలకు పిలుపునిచ్చారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షా శిబిరం ఏప్రిల్ 2 నాటికి మూడేళ్లు పూర్తి అయిన సందర్భంగా పోరాట కమిటీ భారీ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, జేఏసీ చైర్మన్ మరడాన జగ్గునాయుడు, జేఏసీ చైర్మన్ మంత్రి రాజశేఖర్, స్టీల్ గుర్తింపు యూనియన్ నాయకులు ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టినా మోదీ ప్రభుత్వం దిగిరాకపోవడంతో ఏప్రిల్ 2న జీవీఎంసీ వద్ద దీక్షా శిబిరం ప్రారంభించామన్నారు. మూడేళ్లుగా శిబిరాన్ని విజయవంతంగా నడిపిస్తున్న కార్మిక, విద్యార్థి, యువజన, ప్రజా, మహిళా సంఘాల నాయకులను అభినందించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు నిలబడే పార్టీలను రానున్న ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగభూషణం, మన్మథరావు, పడాల రమణ, వామనమూర్తి, పి.మణి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

6న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈనెల 6న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

ఒంటి పూట బడులపై అధికారులు దృష్టి సారించాలి

ఎంవీపీ కాలనీ: పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు నేపథ్యంలో ఒంటిపూట బడుల నిర్వహణపై రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. మంగళవారం ఎంవీపీ కాలనీలో జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ జిల్లాతో పాటు రాష్ట్రంలోని 25 జిల్లాల అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు, కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఒంటిపూట బడులు సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అనుగుణంగా కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఇంకా కొన్ని యాజమాన్యాలు రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మధ్యాహ్నం తరువాత విద్యార్థులతో తిరిగే స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రవాణా శాఖ సైతం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

వైభవంగా పోలిపిల్లిమ్మ పండగ

- అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- విశేషంగా అనుపు మహోత్సవం
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



పోలిపిల్లిమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అప్పన్నపాలెంలో కొలువుదీరిన పోలిపిల్లిమ్మ పండగ మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అడవివరం, పాత అడవివరం, సింహపురి కాలనీ, సింహపురి లేఅవుట్, ప్రహ్లాదపురం, వేపగుంట, శ్రీనివాసనగర్, గొల్లనారాయణపురం తదితర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. రాత్రి అనుపు మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఘటాలను గ్రామంలో పెద్ద ఎత్తున ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తాడేపల్లిగూడెంకు చెందిన కథాకళి కేరళ డ్యాన్స్, సాలూరుకు చెందిన బిందెలు డ్యాన్స్ ఆకట్టుకున్నాయి. రాత్రి పలు వేదికలపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. పండగను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి, కార్యదర్శి ఈశ్వరరావు, కోశాధికారి నోళ్ల దేముడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, పార్టీ వార్డుఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, మాజీ అధ్యక్షుడు పీతల అప్పలరాజు, నాయకులు కె.సింహాద్రి, నడింపల్లి రామరాజు, ఎస్.అప్పారావు, సిడగం తాతబాబు, సింహాచలం దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు సూరిశెట్టి సూరిబాబు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



ఏర్పాటు చేసిన కేరళ కథకళి నృత్యాలు



బిందెలు డ్యాన్స్

ఘనంగా అమ్మవార్ల పండగలు



పైడిమాంబను దర్శించుకున్న పరవాడ ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు

పరవాడ : పరవాడ, నాయుడుపాలెం, దేశపాత్రునిపాలెం, తానాం గ్రామాల్లో కొలువుదీరిన పైడిమాంబ, ముత్యాలమ్మతల్లి, పోలమాంబ, పరదేశిమాంబ అమ్మవార్ల మారువారం పండగను ఆయా గ్రామాల ప్రజలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. పరవాడ గ్రామంలో కొలువుదీరిన పైడిమాంబ అమ్మవారిని ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి, శ్రీనివాసరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధన ప్రారంభించారు. అమ్మవారిని పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మహిళ కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ, ఉప సర్పంచ్ బండారు రామారావు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, చల్లా కనకారావు, వర్రి హరి, సీహెచ్.సన్యాసిరావు దర్శించుకున్నారు.

- నాయుడుపాలెం, వాడచీపురుపల్లి గ్రామాల ఆరాధ్య దైవం ముత్యమాంబ అమ్మవారి మారువారం పండగను మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. అలాగే తానాం పరదేశిమాంబ అమ్మవారి మారువారం పండగ, దేశపాత్రునిపాలెం పోలమాంబ మారువారం పండగ ఘనంగా జరుపుకున్నారు.

అడవివరంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల విస్తృత ప్రచారం



అడవివరంలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అడవివరంలో మంగళవారం రాత్రి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. గడిచిన ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను, చేసిన రాష్ట్రాభివృద్ధిని ప్రజలకు వివరించారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అయితేనే మరింత సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అనంతరం ప్రజలకు కరపత్రాలు అందజేశారు. పార్టీ 98వ వార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, పార్టీ నాయకులు లంక సత్తిబాబు, తెడ్లపు మహేష్, మజ్జి ధర్మా, బోర లక్ష్మణరెడ్డి, లండ వెంకటరమణ, వర్మ, మధురెడ్డి, టి.రాము, శిడగం తాతబాబు, మజ్జీ అప్పలరమణ, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులపై చిన్నచూపు సరికాదు'




1146వ రోజు ఉక్కు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కార్మికులు శ్రమ ఎనలేనిదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి కార్మికులను కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1146వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సింటర్‌ప్లాంట్‌కు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కార్మికవర్గం ఎంతగానో శ్రమించారన్నారు. లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్నం పెడుతున్న స్టీల్‌ప్లాంట్ లాంటి పరిశ్రమను అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంట్‌ను నష్టాల ఊబిలోకి నెట్టేందుకు యాజమాన్యం ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆపాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, సంస్థలోని కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు



సింహాచలం : అడవివరంలోని విజినిగిరి పాలెంలో ఉన్న ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం విశేషంగా పూజలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధికంగా తరలివచ్చి స్వామికి అభిషేకాలు నిర్వహించారు. భక్తి శ్రద్ధలతో స్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు చేశారు.

హైవేపై వాహన తనిఖీలు ముమ్మరం



బాటజంగాలపాలెం చెక్ పోస్టు వద్ద సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ రమణ

సబ్బవరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ రహదారిపై పలు చెక్ పోస్టుల వద్ద పోలీసులు తనిఖీలను ముమ్మరం చేశారు. మండలంలోని అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై బాటజంగాలపాలెంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. సీఐ పిన్నింటి రమణ, సిబ్బందితో కలిసి జాతీయ రహదారిపై వెళ్తున్న పలు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నగదు, మద్యం తరలింపుపై దృష్టి పెట్టినట్టు సీఐ తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

పరవాడ: లంకెలపాలెం–సబ్బవరం రహదారిలో మంగళవారం ఉదయం మంత్రిపాలెం జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ వద్ద ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా అటుగా వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటనలో వెస్ట్ బెంగాల్‌కు చెందిన సహదీప్(52) అనే వ్యక్తి మంగళవారం ఉదయం 5.30 గంటల సమయంలో రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో ఆయనను వెనక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనచోదకుడు బలంగా ఢీకొట్టాడు. సహదీప్ తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు స్మైలెక్స్ పరిశ్రమలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో మంగళవారం 14 కేజీల 3.10 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆర్పీఎఫ్‌పీ ఎస్‌ఐ కె.శాంతారాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై తనిఖీలు నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బ్యాగులో రూ.71,050 విలువ గల 14 కేజీల 3.10 గ్రాముల గంజాయిని గుర్తించారు. బ్యాగును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శాంతారాం తెలిపారు.

టెన్త్ మూల్యాంకనం పరిశీలన



పదో తరగతి పరీక్షల మూల్యాంకనను పరిశీలిస్తున్న సంచాలకుడు విజయభాస్కర్

తుమ్మపాల : పదవ తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం సక్రమంగా చేయాలని జోన్–1 ప్రాంతీయ విద్యా సంచాలకులు విజయభాస్కర్ ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలో గవరపాలెం బాయ్స్ హైస్కూల్, బాలికోన్నత పాఠశాల, ఏఎంఏఎల్ హైస్కూల్లో జరుగుతున్న మూల్యాంకనం కార్యక్రమాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఉపాధ్యాయులు మూల్యాంకనం చేస్తున్న సమాధాన పత్రాలను ప్రిన్సిపల్స్ ఆఫ్ వాల్యువేషన్ ప్రాప్తికి దిద్దుట, అన్ని అంశాలు, మార్కుల వేసే విధానాలను క్షుణ్ణంగా గమనించారు. అదేవిధంగా పరీక్షా కేంద్రాల్లో ఉపాధ్యాయులకు చేకూర్చిన ఏర్పాట్లపైనా అధికారులతో సమీక్షించారు. మూల్యాంకనం నిర్వహిస్తున్న గదుల్లో విద్యుత్, ఫ్యాన్లు సౌకర్యాలను పరిశీలించారు. ఆయనతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ, ఏడీ రవిబాబు పాల్గొన్నారు.